క్లుప్తంగా

ఘనంగా ముగిసిన వైకుంఠ నారాయణ కల్యాణోత్సవాలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పాయకరావుపేట : చిట్టూరి మెట్రోలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వైకుంఠ నారాయణ సమేత వర మహాలక్ష్మి అమ్మవారి ద్వితీయ వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిసాయి. ఆఖరు రోజున సుప్రభాత సేవ, నిత్యార్చన, విష్వక్సేన పూజ, ద్వాదశ తిరువారాధన పవళింపు సేవ, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాద గోష్ఠి తదితర కార్యక్రమాలతో మంగళ వాయిద్యాల నడుమ ద్వితీయ వార్షిక కల్యాణ మహోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

అరబుపాలెంలో స్టూడెంట్ కిట్‌ల పంపిణీ


విద్యార్థులకు కిట్‌లు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: మండలంలోని అరబుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు స్టూడెంట్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి కష్టపడి చదువుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శివనాయుడు,స్కూల్‌కమిటీ చైర్మన్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వరరావు

అచ్యుతాపురం: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, డ్రగ్స్ కారణంగా అనార్యోనికి గురవుతారని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ పి. ఉమామహేశ్వరరావు తెలిపారు. కైట్స్ విద్యా సంస్థల్లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్‌కు అలవాటు పడవద్దని,కొకైన్,గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని సూచించారు. కైట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ రెడ్డి చిరంజీవి,అడిగర్ల శంకర్‌రావు, విల్లూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

200 రోజుల పాటు ‘ఉపాధి’ పనులు కల్పించాలి


తిమ్మరాజుపేటలో నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

అచ్యుతాపురం: మండలంలోని తిమ్మరాజుపేట గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను జిల్లా రైతుసంఘం ప్రతినిధులు,సీఐటీయూ నాయకులు పరిశీలించారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600 సరాసరి వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని కూలీలు నినా దాలు చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము,శరగడం రామునాయుడు,శ్రీనివాసరావు, తిరుపతమ్మ, కోదండమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు.

మునగపాకలో వాహన తనిఖీలు

మునగపాక: ప్రతి ఒక్కరూ రహదారి జాగ్రత్తలు పాటించాలని ఏఎస్ఐ మన్మధరావు కోరారు. మునగపాక మెయిన్‌రోడ్డులో శుక్రవారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

• ఉత్సాహంగా అంతర్జాతీయ యోగా డే


మునగపాకలో యోగాసనాలు వేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలు


బోదపాలెం ఎంపీపీ స్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


హరిపాలెం ఉన్నత పాఠశాలలో సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు


మునగపాకలో పతంజలి యోగా ఆధ్వర్యంలో..


పోతురెడ్డిపాలెంలో ఉపాధిహామీ కూలీలతో యోగా సాధన చేయిస్తున్న ఎంపీడీవో అప్పలనాయుడు

నక్కపల్లి: యోగా ద్వారా జ్ఞాపక శక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంఈవో కుంచం నరేష్ అన్నారు. యోగా డేను పురస్కరించుకుని వేంపాడు, చినదొడ్డిగల్లు, పెదబోదిగల్లం, నక్కపల్లి తదితర పాఠశాలల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగా ఆవశ్యకతను తెలియజేస్తూ విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ఒత్తిడితో ఇబ్బంది పడేవారికి అనారోగ్య సమస్యలు దరిదాపుల్లో రాకుండా యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి రోజు యోగా చేయాలన్నారు. చదువుతోపాటు విద్యార్థులకు యోగా నేర్పించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, శ్రీనివాసరావు, సలీమా తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో ఉత్సాహంగా నిర్వహించారు. ఆకట్టుకునేలా విద్యార్థులు యోగాసనాలు వేశారు. బోడపాలెం ఎంపీపీ స్కూల్, రాజుపేట ఎంపీయూపీ స్కూల్, కె.వెంకటాపురంలోని జెడ్పీ హైస్కూల్‌లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యోగా వల్ల కలిగే లాభాలను వివరించారు. యోగా విలువ తెలుసుకోవాలని తెలిపారు. హెచ్‌ఎంలు షేక్ అల్లావుద్దీన్, షేక్ ఖాలీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాగులాపల్లిలో బీజేపీ ఐటీ విభాగం నాయకులు మళ్ల కాలేశ్వరరావు ఆధ్వర్యంలో యోగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయం సమీపంలోని పతంజలి యోగాశ్రమంలో వేడుకలు నిర్వహించారు. యోగా సాధన వల్ల కలిగే ప్రయోజనాలను ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ వివరించారు. మునగపాక మెయిన్‌రోడ్డు దరి ఉపాధిహామీ పథకం కూలీలతో యోగా సాధన చేయించారు. తోటాడ రాజయోగా ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఓం కార పీఠం వద్ద నిర్వహించిన వేడుకల్లో యోగా శిక్షకుడు కుమార్‌రాజా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ట్రస్ట్ సుసుమ్నకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పలు విభాగాలకు సంబంధించిన వారు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: యోగాసనాలతో సర్వరోగాల నుంచి ఉపశమనం పొందవచ్చని కొరుప్రోలు ఆయుర్వేదిక్ వైద్యులు సుజాత అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో పలువురు ప్రముఖులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి యోగాసనాలు వేశారు. సర్వసిద్ధిలో పీహెచ్‌సీ సిబ్బంది, వేమగిరిలో ఉపాధి కూలీలు యోగా సనాలు వేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోరా జగదీష్, చేకూరి శ్రీరామచంద్రరాజు, కొరుప్రోలు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సకురు సత్యనారాయణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్:అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం యలమంచిలి పట్టణం, మండలంలో ఉత్సాహంగా నిర్వహించారు.కొక్కిరాపల్లి అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థినులు యోగా విన్యాసాలతో ఆకట్టుకున్నారు. 5 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థినులు,సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.నిత్య జీవితంలో యోగా ప్రాధాన్యతను ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం వివరించారు. మండలంలోని పోతురెడ్డిపాలెంలో ఉపాధిహామీ పథకం మండల యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా డే కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధి కూలీలతో కాసేపు యోగాసనాలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం వల్ల అటు శారీరక ఆరోగ్యం సమకూరడంతో పాటు మానసిక రుగ్మతలు కూడా మటుమాయం అవుతాయన్నారు.

17 గ్రామాల్లోని ఉపాధి వేతనదారులతో కూడా యోగాసనాలు వేయించినట్టు ఉపాధి హామీ పథకం సిబ్బంది తెలిపారు.కార్యక్రమంలో పోతురెడ్డిపాలెం సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు,ఉపాధిహామీ పథకం ఈసీ శేఖర్,సందీప్ వర్ధన్ ఫీల్డ్ అసిస్టెంట్ రమ్య,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. జంపపాలెం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు యోగాసనాలు చేశారు.యోగా ద్వారా దీర్ఘకాలిక రోగాలను నయం చేసుకోవచ్చని,ప్రతి ఒక్కరూ రోజూ యోగా సాధన చేయాలని ప్రధానోపాధ్యాయుడు ఎ.వి.హెచ్. శాస్త్రి సూచించారు.

యలమంచిలి: యోగ సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యలమంచిలి సీఐ షేక్ గఫూర్ తెలిపారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సర్కిల్ పరిధిలో ఉన్న ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బందితో కలసి ఆయన యోగసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది పని ఒత్తిడి,శారీరక శ్రమ,నిద్రలేమి వంటి సమస్యలతో సతమతమవుతుంటారని, వీటిన్నంటిని అధిగమించాలంటే ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ పాపినాయుడు,ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ,యలమంచిలి పట్టణ,రూరల్,మునగపాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బంది యోగాసనాలు వేశారు.సీఐ బుచ్చిరాజు ఆధ్వర్యంలో సిబ్బంది పలు ఆసనాలు వేశారు.

- అచ్యుతాపురం మండలంలోని జగ్గన్నపేటలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు.సమరసత సేవా ఫౌండేషన్ యలమంచిలి ఖండ సంయోజకులు బి.వి. రమణ ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు,దొడ్డి కృష్ణ,ఆడారి త్రినాథ్,మళ్ల బుజ్జి,దొడ్డి భాస్కర్ రావు,దొడ్డి పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.
- మండలంలోని పలు పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.హరిపాలెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే సూర్య నమస్కారాలు,పలు ఆసనాలు వేయించారు.హెచ్ఎం పాదం రవి, పీడీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కొక్కిరాపల్లి గురుకులంలో యోగా డే ఆకారంలో విద్యార్థుల విన్యాసం


నాగులాపల్లి హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న చిన్నారులు, ఉపాధ్యాయులు


బోదిగల్లం పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న బాలికలు


చినదొడ్డిగల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


కొరుప్రోలు పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, పెద్దలు


కొక్కిరాపల్లి గురుకులంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు


జంపపాలెం జెడ్పీ హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు


జగ్గన్నపేటలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం


తోటాడ రాజయోగాశ్రమంలో ..


అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో ..


వేమగిరిలో యోగాసనాలు వేస్తున్న ఉపాధి కూలీలు


యోగాసనాలు వేస్తున్న సీఐ షేక్ గఫూర్,ఎస్ఐలు

కార్యకర్తలకు అండగా ఉండాలని వైఎస్ జగన్ ఆదేశం


కంబాల జోగులు

నక్కపల్లి: ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ అధైర్యపడాల్సిన అవసరం లేదని, నియోజకవర్గాల్లో కార్యకర్తలకు అందుబాటులోఉంటూ అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులతో తాడేపల్లిలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై దిశానిర్దేశం చేశారని చెప్పారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమపథకాలు అమలు చేసి దళారుల ప్రమేయం లేకుండా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చామన్నారు. ప్రజలు మార్పు కోరుకోవడం చాలా బాధగా ఉందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చినప్పటికీ ఓటమి చెందడంపై సమీక్ష చేసుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్ జగన్ పేర్కొన్నారన్నారు. నిజాయితీగా ఉంటే కుదరని అలా అని ధర్మాన్ని వీడే ప్రసక్తి లేదన్నారు. అమలు సాధ్యం కాని హామీలు ఇవ్వకపోవడం వల్లే ఓటమి చెందామని జగన్ పేర్కొన్నారన్నారు. అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలన్నారు. సూపర్‌సిక్స్, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏ మేరకు నెరవేరుస్తారో వేచి చూడాలన్నారు. ప్రజలకోసం పోరాటం చేయడంలో వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని జగన్ తెలిపారన్నారు. రాష్ట్రంలో 40 శాతం మంది వైఎస్సార్‌సీపీకి ఓట్లేసిన విషయం ప్రతి అభ్యర్థి గుర్తుంచుకోవాలని చెప్పారని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించారన్నారు. ముఖ్యంగా కార్యకర్తలకు అండగా నిలవాలని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న దాడులను సమర్థంగా ఎదుర్కోవాలని చెప్పారని తెలిపారు. న్యాయపరంగా పోరాటం చేసేందుకు లీగల్ సెల్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. టీడీపీనాయకుల దాడులు, వేధింపుల వల్ల నష్టపోయిన, గాయపడిన, చనిపోయిన వారి కుటుంబాలను త్వరలో స్వయంగా కలిసి ఓదార్చనున్నట్టు వైఎస్ జగన్ చెప్పారని తెలిపారు. నియోజకవర్గంలో ఉంటూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటామన్నారు.

వరుస దొంగతనాలతో హడలెత్తుతున్న జనం


తెరిచి ఉన్న బీరువా

కోటవురట్ల: వరుస దొంగతనాలతో మండలవాసులు హడలెత్తిపోతున్నారు. 15 రోజుల వ్యవధిలో మరోసారి ఓ ఇంట్లో దొంగలు పడి దోచుకుపోయారు. ఇదే నెలలో 8 నుంచి 12వ తేదీ మధ్యలో అన్నవరం గ్రామంలో ఓ ఇంట్లో దొంగలు పడి 3 తులాల బంగారం, 12 తులాల వెండి ఆభరణాలను దొంగిలించుకుపోయారు. ఇదే తరహాలో తాజాగా శుక్రవారం కొడవటిపూడిలో దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన బాలేపల్లి రమణ ఇంట్లో దొంగలు పడి బంగారాన్ని దోచుకుపోయారు. ఏఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలేపల్లి రమణ ఈ నెల 17న తునిలో ఉన్న తన భార్య వద్దకు వెళ్లాడు. తిరిగి శుక్రవారం రాగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచిఉన్నాయి. అందులో భద్రపరిచిన 3 తులాల బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయాయి. దీంతో బంగారం అపహరణకు గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

సమగ్ర బాలికల వసతి గృహంలో ప్రవేశాలు

కశింకోట: స్థానిక సమగ్ర బాలికల వసతి గృహంలో ప్రవేశాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వసతి గృహం సంక్షేమ అధికారి నిర్మల సమక్షంలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాలు, ప్రధానంగా చింతపల్లి, పాడేరు తదితర ఏజెన్సీ ప్రాంతాల నుంచి బాలికలు వసతి గృహంలో చేరుతున్నారు. సమీపంలో బాలికల హైస్కూల్ ఉండటం, వసతి గృహంలో సదుపాయాలు మెరుగ్గా ఉండటంతో ఆసక్తి చూపుతున్నారు. వసతి గృహంలో 400 సీట్లు ఉన్నాయి. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలికలు ఇక్కడ ఉంటూ, చదువుకుంటున్నారు.వీటిలో 80సీట్లు ఖాళీగా ఉండటంతో వాటికి ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు కొత్తగా 20మంది చేరారని, వచ్చే నెలాఖరు వరకు ప్రవేశాలకు సమయం ఉన్నట్లు సంక్షేమ అధికారి నిర్మల తెలిపారు.

భవిత కేంద్రం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలు,పలకలు అందజేస్తున్న దృశ్యం

మునగపాక:దివ్యాంగ పిల్లలు కష్టపడి చదువుకోవాలని మునగపాక భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు సుమతి కోరారు. ఎస్‌బీఐ యూనియన్ నాయకులు స్వర్గీయ తారక్‌నాథ్ 20వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం భవిత కేంద్రం పిల్లలకు అవసరమయ్యేపుస్తకాలు, పలకలు,పెన్నులు సమకూర్చారు. వాటిని విద్యార్థులకు అందజేసిన సుమతి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతల సహకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విజయేశ్వర్,తారకనాథ్ శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాంబిల్లి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈఈ రాజశేఖర్ ఓ ప్రకటలో పేర్కొన్నారు. రాంబిల్లి, నేవీ పునరావాసకాలనీ, వాడపాలెం, కొత్తపేట, చినకలవలాపల్లి, కొప్పుగొండుపాలెం, కొత్తపట్నం, వాడనర్సాపురం, గోవిందపాలెం, పెదకలవలాపల్లి గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు

మూడో విడత చందన సమర్పణ నేడు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం కొబ్బరితోటలోని వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో శనివారం స్వామివారికి మూడో విడత చందన సమర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం తెల్లవారుజామున 5 గంటలకు చందన సమర్పణ, అనంతరం లక్ష్మీ ఆండాళ్ అమ్మ వారికి పంచామృత అభిషేకం, సాయంత్రం 6.30 గంటలకు స్వామివారికి, అమ్మవారికి దీపాలంకరణ, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరపనున్నట్లు వెల్లడించారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులు

• జెడ్పీటీసీ ధూళి నాగరాజు



రాంబిల్లి: ప్రొటోకాల్ పాటించడంలో రాంబిల్లి మండల అధికారులు విఫలమైనట్టు జెడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు ఆరోపించారు. హరిపురంలో శుక్రవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ పంచదార్లలో జరిగిన విత్తనాల పంపిణీ కార్యక్రమానికి తనకు గానీ, ఎంపీపీ శిరీషకు గానీ ఆహ్వానం, సమాచారం ఇవ్వలేదన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన తాము ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయ్యామని, అలాంటి తమను ఆహ్వానించకుండా టీడీపీ, జనసేన పార్టీ నాయకులను పిలిచి వారి చేత విత్తనాలు పంపిణీ చేయడం అన్యాయమని చెప్పారు. రాంబిల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి తమకు ఆహ్వానం, సమాచారం ఇవ్వలేదన్నారు. అధికారులు తీరు మార్చుకోవాలన్నారు. దీనిపై తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఆర్బీకేల్లో అందుబాటులో వరి విత్తనాలు


వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీ ప్రభాకర్

ఎస్.రాయవరం: ఖరీఫ్‌లో అవసరమైన విత్తనాలను ఆర్బీకేల ద్వారా రైతులు పొందవచ్చని యలమంచిలి సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు బి. ప్రభాకర్ తెలిపారు. ఎస్.రాయవరంలో శుక్రవారం ఆయన వరివిత్తనాలు పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆర్బీకేల్లో ఆర్‌జీఎల్ 1052 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం విత్తనాలు 86 క్వింటాళ్లు,ఎంటీయూ 1061 రకం 67 క్వింటాళ్లు అందుబాటు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధూళి శ్రీనుబాబు,మాజీ సర్పంచ్‌లు నల్లపరాజు వెంకటరాజు, అల్లు నరసింహమూర్తి,వైఎస్సార్ సీపీ నాయకులు నాగేశ్వరరావు,జనసేనా మండల పార్టీ అధ్యక్షుడు పప్పల శివ,టీడీటీ నాయకులు గుర్రం రామకృష్ణ,కర్రం శివ, వ్యవసాయాధికారి సౌజన్య పాల్గొన్నారు. అనంతరం గుడివాడ, పెదఉప్పలం, పెట్టుగోళ్లపల్లి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా వరి విత్తనాలు పంపిణీ చేశారు.

లోవోల్టేజీతో ఇక్కట్లు

కోటవురట్ల: వారం రోజులుగాలో ఓల్టేజీతో అవస్థలుపడుతున్నామని స్థానిక సాయిలక్ష్మి గార్డెన్స్ కాలనీవాసులు తెలిపారు. తమ కాలనీలో సుమారు 30 కుటుంబాలునివాసముంటున్నట్టు చెప్పా రు. రెండు నెలల క్రితం ఈ సమస్యపై ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశామని, దాంతో తాత్కాలికంగా కార్యాలయం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇచ్చారని తెలిపారు. రెండో రోజు నుంచే మళ్లీ కష్టాలు మొదలయ్యాయని, చిన్న పిల్లలు, వృద్ధులు మండే ఎండలకు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారని వా పోయారు. ఫ్యానులు తిరగకపోవడంతో తెల్లవార్లూ జాగారం చేయాల్సి వస్తోందని చెప్పారు. గతంలో కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశామని, అయినా శాశ్వత పరిష్కారం దొరకలేదని తెలిపారు. అధికారులు స్పందించి తమ కాలనీకి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.